

నెల గడవకుండానే..

● పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ బదిలీ

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 27 : విధుల్లో చేరి నెల గడవకుండానే పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ బదిలీ కావడం చర్చనీయాంశమవుతోంది. పాలకవర్గంతో విభేదాలా?.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా? అన్న దానిపై సర్వత్రా పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గాజువాక నుంచి బదిలీపై వచ్చిన పి.సింహాచలం ఈ నెల 2న పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇంతలోనే ఆయన్ని ఇక్కడ నుంచి చీరాలకు స్థానచలనం కల్పిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నుంచి కె.శ్రీనివాసరావును పార్వతీపురం కమిషనర్‌గా బదిలీ చేసింది.

యుద్ధానికి సై

● ఎవరికీ భయపడొద్దు
● ప్రతిఒక్కరూ మరో పది మందితో ఓటు వేయించాలి
● ఎన్నికల్లో విజయం సాధిద్దాం
● మా కుటుంబం కోసం కాదు.. మీ కోసం.. రాష్ట్రం కోసం
● నారా భువనేశ్వరి పిలుపు
● సాలూరులో ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఆరోగ్య కేంద్రం ప్రారంభం



సాలూరులో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

సాలూరు, ఫిబ్రవరి 27: ఎన్నికలకు సమయం సమీపిస్తున్నందున.. అంతా యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె సాలూరులోని ఇప్పిలివారి వీధిలో ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'మీ అందరి ఉత్సాహం చూస్తుంటే.. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇలా మీ ముందు నిల్చుని మాట్లాడానికి నాకు ధైర్యం కూడా వస్తోంది.. మరొక రెండు, మూడు నెలల్లో జరిగే యుద్ధానికి సిద్ధం కావాలి.. ఇది మా కుటుంబం కోసం కాదు.. మీ కోసం.. రాష్ట్రం కోసం' అని ఆమె అన్నారు. ఓటు వేసేందుకు వెనుకడుగు వేయొద్దని.. ఎవరికి భయపడొద్దని .. చంద్రబాబు అండగా ఉంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ మరో పది మందితో ఓటు వేయించాలని పిలుపునిచ్చారు. 'ఇబ్బందులు ఎదుర్కొంటాం.. అయినా సరే పోరాడాలి.. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, అభిమానులు చేయి చేయి కలిపి విజయం సాధించాలి' అని కోరారు. ఎన్నికల్లో మన ఆయుధం ఏంటని ఆమె ప్రశ్నించగా.. ప్రజలు, పార్టీ శ్రేణులు ఓటు అని చెప్పారు. దీంతో యుద్ధానికి సైసై అంటూ అందర్నీ ఆమె ఉత్సాహపరిచారు.


భువనేశ్వరికి ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

ప్రజలకు సేవ చేయాలనే..

ప్రజలకు దగ్గరగా ఉండి సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య క్లీనిక్‌ను ఏర్పాటు చేసినట్లు భువనేశ్వరి తెలిపారు. స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. 'ప్రజలే దేవుళ్లు అని నమ్మిన ఎన్టీఆర్ స్ఫూర్తితోనే చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఈ ట్రస్ట్ ద్వారా 12,900 ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాం. 19 లక్షల 43 వేల మందికి రూ.20 కోట్ల విలువైన మందులు అందించాం. మూడు బ్లడ్‌బ్యాంక్‌ల ద్వారా ఎనిమిది లక్షల మందికి రక్తాన్ని ఇచ్చాం. మొత్తంగా 81వేల 361 యూనిట్ల రక్తాన్ని నిరుపేదలకు ఉచితంగా అందజేశాం. 19,956 యూనిట్లు తలసేమియా బాధితులకు, 7,652 యూనిట్లు ప్రభుత్వ వైద్యశాలలకు అందించాం. ఇప్పటివరకు సంజీవని క్లీనిక్‌ల ద్వారా 67,104 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా 33 వేల 681 కుటుంబాలకు సేవలు అందించాం. పాలకొండ, కురుపాం, పాకాల, పోల వరం, పాడేరు, రంపచోడవరం, అరకులో కూడా సంజీవని క్లీనిక్‌లు ప్రారంభిస్తాం. ఇప్పటివరకు ట్రస్ట్ ద్వారా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కొంతమందికి కృత్రియ అవయవాలు అందజేశాం. వరదలు వచ్చినప్పుడు నెల్లూరు, కడప జిల్లాల్లో కూలిపోయిన 105 ఇళ్లకు మరమ్మతులు చేసి, 48 కుటుంబాలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశాం. కేరళలోనూ వరదల సమయంలో రూ. పది లక్షలు విలువ చేసే నోట్ పుస్తకాలు, రూ.20 లక్షల విలువైన మందులు ట్రస్ట్ ద్వారా బాధితులకు అందించాం. కరోనా కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ. కోటిన్నరతో మూడు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. రూ. రెండున్నర లక్షల విలువైన మాస్క్‌లు ప్రజలకు అందించాం. 20 వేల కుటుంబాలకు అవసరమైన వస్తువులు, ఆహార పదార్థాలను నేరుగా వారి ఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకున్నాం. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పాఠశాలలను నడుపుతున్నాం. వాటి ద్వారా 1,938 మంది విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నాం. రూ.మూడు కోట్ల 44 లక్షలతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నాం. ట్రస్ట్ ద్వారా సుజల కింద రెండు క్లస్టర్‌లు, మూడు ప్లాంట్లు పెట్టి మూడున్నర లక్షల మందికి సురక్షిత నీటిని అందజేస్తున్నాం. ఇవే కాకుండా ఇంకా ఎన్నో కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నాం. దేశంలో ఎక్కడైనా.. ఎవరికైనా ఆపద వస్తే ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుంటుంది. ట్రస్ట్ సభ్యులు, టీం, డాక్టర్లు అందిస్తున్న సేవల ద్వారానే ఇదంతా సాధ్యమవుతుంది' అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ అనురాధ, పార్టీ పరిశీలకుడు విశ్వప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, నాయకులు తిరుపతిరావు, ప్రసాద్‌బాబు, పరమేశ్, వేణు, వెంకటరమణ, కౌన్సిలర్లు, అభిమానులు, ప్రజలు, తెలుగుదేశం-జనసేన పార్టీల కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భువనేశ్వరి

పర్యటన ఇలా..

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా నారా భువనేశ్వరి మంగళవారం మధ్యాహ్నం 3:10 గంటలకు సాలూరు చేరుకున్నారు. తొలుత కన్వాయ్ పట్టణంలో ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద చేరుకోగా.. స్థానిక టీడీపీ నేతలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నారా భువనేశ్వరి శ్రేణులతో కలిసి కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న పార్టీ అధ్యక్షులు, పార్టీ శ్రేణులను ఆమెకు పరిచయం చేశారు. ఆ తర్వాత సంజీవని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పట్టణంలో ఉన్న మహిళా నాయకులు బందాపు సీతమ్మ, అప్పయమ్మ, శోభారాణి, డబ్బి అన్నపూర్ణ, అప్పికొండ రమాదేవితో పాటు పలువురితో భువనేశ్వరి మాట్లాడారు. సుమారు 4:10 గంటలకు ఆమె అక్కడ నుంచి వెనుదిరిగారు. పార్టీ శ్రేణులు మాత్రం నూతనోత్సాహంతో కేరింతలు కొట్టి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార రథంపై తన నివాసానికి వెళ్లారు.

శరణు శరణు పోలమాంబ

● శంబర ఆరో వారం జాతరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ/సాలూరు రూరల్, ఫిబ్రవరి 27: శంబర ఆరో వారం జాతరకు భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. ఉదయం నుంచే భక్తజనం తాకిడి కనిపించింది. సుమారు 20 వేల మందికి పైబడి రావడంతో క్యూలైన్లు అన్నీ కిక్కిరిసి పోయాయి. దీంతో క్యూలైన్లు దాటి రోడ్డుపై భక్తులు గంటల కొద్దీ నిరీక్షించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోముఖీ నది తీరం, వనం గుడి వద్ద కూడా భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. కొందరు గ్రామ సమీపంలోని తోటల్లోనే వంటలు చేసుకొని భోజనాలు చేశారు. ఇదిలా ఉండగా సాలూరు ఆర్టీసీ డిపో నుంచి శంబ రకు ఏడు బస్సులను నడిపారు. ప్రైవేట్ వాహనాలు కూడా నడిచాయి. జాత రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత విధులు నిర్వహించారు.


పూజలందుకున్న పోలమాంబ

పెళ్లి సంబంధానికి వెళ్లి వస్తుండగా..

● కొడంగివలస ఘాట్‌రోడ్డులో జీపు బోల్తా
● 25 మంది గిరిజనులకు గాయాలు

సాలూరు రూరల్/మక్కువ, ఫిబ్రవరి 27: వివాహ సంబంధం మాట్లాడేందుకు వారంతా జీపులో గిరి శిఖర గ్రామానికి వెళ్లారు. పెళ్లి మాటలు పూర్తయిన తరువాత విందు ఆరగించి.. తిరిగి జీపులో స్వగ్రామానికి వస్తుండగా వాహనం బోల్తాపడింది. సాలూరు మండలం కొడంగివలస ఘాట్‌రోడ్డులో జరిగిన ఈ ఘటనలో 25 మంది గిరిజనులు గాయపడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కువ మండలం దబ్బగెడ్డ పంచాయతీ విజయరాంపురానికి చెందిన ఓ యువకుడి వివాహ సంబంధం కోసం కొంతమంది గిరిజనులు మంగళవారం ఉదయం జీపులో సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామం కొదమకు వెళ్లారు. వరుడు, వధువు తరపు బంధువులు కట్న, కానుకలు గురించి చర్చించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విందు ఆరగించారు. సాయంత్రం ఆరు గంటలకు స్వగ్రామం విజయరాంపురానికి జీపులో బయలుదేరారు. అయితే కొడంగివలస ఘాట్‌రోడ్డు వద్ద జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 25 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆటోలు, 108 వాహనంలో ఆసుపత్రులకు తరలించారు. 14 మందిని శంబర పీహెచ్‌సీకి, 11 మందిని సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. శంబర పీహెచ్‌సీలో 14 మందికి వైద్యాధికారి రఘుకుమార్ చికిత్స అందించి పది మందిని ఇంటికి పంపించారు. మిగిలిన నలుగురిని సాలూరుకు రిఫర్ చేశారు. సాలూరు రూరల్ ఎస్ఐ వెంకటరమణ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


సాలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు సుబ్బారావు, శ్రీదేవి


కొడంగివలస వద్ద బోల్తా పడిన జీపు

ప్రలోభాల పర్వం

● ఎన్నికల వేళ వైసీపీ నాయకుల ఓట్లు వల
● మహిళలకు చీరలు, నగదు పంపిణీ


సీతానగరం మండలం తామరఖండిలో మహిళలకు చీరలు, నగదు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

పార్వతీపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ.. వైసీపీ నాయకులు ప్రలోభాల పర్వానికి తెరతీస్తున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే చీరలు, నగదు పంపిణీ చేసే కార్యక్రమాన్ని వ్యూహాత్మకంగా చేపడుతూ.. ఓటర్లకు వల వేస్తున్నారు. జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జోరుగా సాగుతుంది. పార్వతీపురం ఎమ్మెల్యేగా జోగారావు గెలిచిన తర్వాత నియోజకవర్గంలో అప్పుడప్పుడు మహిళలకు చీరలు, నగదు పంపిణీ చేసేవారు. అయితే కొద్దిరోజుల కిందట సీతానగరం మండలం పనుకుపేటలో ఆయనే స్వయంగా ఆ గ్రామ మహిళలకు చీరలు, నగదు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే సేవా దృక్పథంతోనే తమ ఎమ్మెల్యే ఈ కార్యక్రమం చేపట్టారని ఆయన అనుచరులు చెప్పుకొస్తుండడం విశేషం. ఏటా క్రిస్మస్ నుంచి ఉగాది వరకు పంపిణీ చేస్తుంటారని వారు చెబుతున్నారు. కాగా ఎన్నడూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టని కొంతమంది వైసీపీ నేతలు సైతం కొన్ని గ్రామాల్లో తాయిళాలు అందించడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. తాజాగా అదే మండలంలో మరోసారి ఈ కార్యక్రమం చేపట్టారు. మంగళవారం తామరఖండిలో వైసీపీ నాయకులు గ్రామంలో మహిళలకు నగదు, చీరలు పంపిణీ చేశారు. అయితే దీనిని ప్రతిపక్షాలతో పాటు ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఐదేళ్లలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టని వైసీపీ నేతలు .. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతోనే ఇలా చేస్తున్నారనే వ్యాఖ్యలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటి నుంచే తాయిళాల కార్యక్రమానికి శ్రీకారం చుడితే.. ఇక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వైసీపీ నేతలు ఓటర్లను మరెన్ని ప్రలోభాలకు గురిచేస్తారోనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ అంశంపై ఇప్పటికే ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదుల వెళ్లినట్లు సమాచారం. మరి ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో.. ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

అభివృద్ధి పనులకు ఒప్పుకోరా?

● చైర్‌పర్సన్‌పై నిప్పులు చెరిగిన అధికార పార్టీ కౌన్సిలర్
● ఇద్దరి మధ్య వాగ్వాదం ● స్వపక్షంలో విపక్షం...
● తాగునీరు, ఇతరత్రా సమస్యలపై ప్రశ్నించిన టీడీపీ కౌన్సిలర్లు
● అధికారుల తీరుపై విమర్శలు
● రసాభాసగా పార్వతీపురం మున్సిపల్ సమావేశం



కౌన్సిలర్ లక్ష్మీ పార్వతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్

తోటి ప్రజాప్రతినిధిని గౌరవించాలని చైర్‌పర్సన్‌కు చెబుతున్న 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ లక్ష్మీ పార్వతి

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 27 : పార్వతీపురం మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతిపక్షాలతో పాటు వైసీపీ కౌన్సిలర్లు కూడా నిప్పులు చెరిగారు. అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అధికార పార్టీ కౌన్సిలర్లు స్వపక్షంలో విపక్షంగా మారడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలోని అంశాలను చదువుతుండగా.. 16వ వార్డు కొత్త బెలగాంలోని సీసీ కాలువల నిర్మాణానికి కేటాయించిన రూ.8.60 లక్షలను నిలుపుదల చేయాలని చైర్‌పర్సన్ కమిషనర్ పి.సింహాచలంను ఆదేశించారు. దీనిపై 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ లక్ష్మీపార్వతి అభ్యంతరం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే.. చైర్‌పర్సన్‌గా ఎందుకు ఒప్పుకోరు? అంటూ ఆమె ప్రశ్నించారు. పట్టణంలో 30 వార్డులు ఉండగా 16వ వార్డుకే సాధారణ, ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చైర్‌పర్సన్‌గా మీ మాటలు సరిగ్గా లేవు' అని ఆమె అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో మిగతా అధికార పార్టీ కౌన్సిలర్లు స్పందించి.. వారిద్దరిని శాంతింపజేశారు. అధికార పార్టీకి చెందిన చైర్‌పర్సన్ తన వార్డు అభివృద్ధిని అడ్డుకోవడంతో పాటు సభా మర్యాద పాటించకపోవడం విచారకరమని 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ లక్ష్మీపార్వతి ఆవేదన వ్యక్తం చేశారు.

బిందెడు నీటి కోసం కష్టాలు పడమంటారా..?

వేసవిలో పట్టణ వాసులు బిందెడు నీటి కోసం కష్టాలు పడమంటారా? అని 14వ వార్డు టీడీపీ కౌన్సిలర్ డి.శ్రీదేవి చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్, అధికారులను ప్రశ్నించారు. నాలుగైదు రోజులకు తాగునీటి సరఫరా చేయడం సరికాదన్నారు. రెండ్రోజులకొకసారైనా కొళాయిల ద్వారా నీటిని అందించాలన్నారు. కాలువల్లో పూడికలు తీయించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలో వరహాల గెడ్డపై ఉన్న వంతెన కూలేందుకు సిద్ధంగా ఉందని, దీనిని అజెండాలోని మొదటి అంశంగా పొందుపరిచి ఇప్పుడు వాయిదా వేయాలనడం సరికాదన్నారు. దీంతో చైర్‌పర్సన్, శ్రీదేవిల మధ్య వాగ్వాదం జరగ్గా, అధికారులు కల్పించుకుని ఇరువురిని శాంతింపజేశారు.

అధికారుల తీరుపై ధ్వజం

మున్సిపాల్టీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారుల తీరుపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. తాము చెప్పింది కాకుండా మున్సిపల్ అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లు అంజెండాలోని అంశాలను పొందుపరచడం సరికాదన్నారు. వరహాల గెడ్డపై కల్వర్టు నిర్మాణానికి సంబంధించి ఎవరిని అడిగి రూ. 17 లక్షలు కేటాయించారని కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను చైర్‌పర్సన్ ప్రశ్నించారు. అనంతరం టేబుల్ అజెండా చదవకముందే చైర్‌పర్సన్ వెళ్లిపోవడంపై అధికారులు అసహనం వ్యక్తం చేశారు.


తాగునీటి సమస్యపై మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీదేవి

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

● ఐటీడీఏ పీవో విష్ణుచరణ్



మాట్లాడుతున్న పీవో

పార్వతీపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ హెచ్చరించారు. విద్యార్థుల మరణాలు, వసతిగృహ నిర్వహణ తదితర అంశాలపై మంగళవారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సమీక్షించారు. ఎప్పటికప్పుడు వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వారు అనారోగ్యానికి గురైతే ఇళ్లకు పంపరాదని, వెంటనే ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని సూచించారు. వైద్యాధికారులు, వసతి గృహ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదు వుల విషయంలో సంక్షేమాధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు బాధ్యత వహించాల న్నారు. టెన్త్ పరీక్షల అనంతరం పాలిటెక్నిక్ తదితర వాటిల్లో ప్రవేశంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎం.రుక్మాంగధరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తీరుతో క్రికెట్ క్రీడాకారుడికి అన్యాయం

● విహారి ఆంధ్ర టీంను వీడడంపై టీడీపీ నాయకుల ఆవేదన ● రోజా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 27: ఆడుదాం ఆంధ్రా అంటూ.. ఐదేళ్ల కాలంలో ఆంధ్రాతో జగన్మోహన్‌రెడ్డి ఆడు కుని రాష్ట్రాన్ని తిరోగమనంలోకి తీసుకువెళ్లారని టీడీ పీ-జ నసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భా గంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హా మీలను వివరించారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ క్రీడాకారులతో రాజకీయాలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డి దక్కించుకున్నారన్నారు. తాజాగా వైసీపీ అతి జోక్యం వల్ల క్రికెట్ క్రీడాకారుడు విహారి వైదొగలడం బాధాకరమన్నారు. సైకో పాలనను అంతం చేయాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. టీడీపీ నాయకులు కనకలమురళీమోహన్, అవనాపు విజయ్, బోని కుమార్, కోరాడ వెంకట రమణ, మామిడి దేవేంద్ర నాథ్ పాల్గొన్నారు.


టిఫిన్ వ్యాపారికి సూపర్ సిక్స్ హామీలను వివరిస్తున్న అదితి


మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: టెస్ట్ క్రికెటర్ హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణ చెప్పాలని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నేతలతో కలిసి ఎల్.కోటలో విలేఖరులతో సమాశం ఏర్పాటు చేశారు. క్రీడల మంత్రిగా రోజా రాష్ట్ర పరువు తీసిందని విమర్శించారు. వైసీపీ నేత కొడుకు కోసం ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్‌పై ఒత్తిడి తెచ్చి రంజీ కెప్టెన్సీ నుంచి హనుమ విహారిని తప్పించారని మండిపడ్డారు. వెంటనే క్షమాపణ చెప్పి కెప్టెన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, లాలం అర్జునరావు, సతీష్, సాగర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విహారికి న్యాయం చేయాలి



బొబ్బిలి: టీమ్ ఇండియా టెస్ట్ స్పెషలిస్టు హనుమవిహారిని రాజకీయ ఒత్తిడితో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి దూరం చేయడం అన్యాయమని బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక దర్బారుమహల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ జట్టులో 17 వ స్థానంలో ఉండే వైసీపీ నేత కుమారుడిని మందలించాడనే నెపంతో తెలుగుతేజం, ఇండియా టెస్ట్ స్పెషలిస్టు అయిన హనుమ విహారిని ఆంధ్రా రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకునేలా ఒత్తిడి చేయడం దారుణమన్నారు. మంత్రి రోజా హనుమవిహారికి క్షమాపణలు చెప్పితిరిగి అతనికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. క్రీడాకారుల భవిష్యత్‌పై రాజకీయ జోక్యం పూర్తిగా నివారించాలని, ప్రభుత్వపరంగా నష్టనివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

వైసీపీ నేతల వల్లే



దాసన్నపేట: వైసీపీ నేతల కారణంగానే క్రికెట్ ఏపీ టీమ్ నుంచి వైదొలిగాడని జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆరోపించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. క్రీడలపై కూడా వైసీపీ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రతిభావంతుడైన క్రికెటర్ హనుమవిహారీని వేధించడం దారుణమని, ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ క్రీడాకారుల జీవితాలతో చెలగాటం అడటం బాధాకారమన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రతిష్టను అన్ని విధాలా నాశనం చేశారని దయ్యబట్టారు.

చంద్రబాబు పాలన కోసం ఎదురుచూపు

రాజాం, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో సంతకవిటి మండలం జావం, సువరం, వాసుదేవపట్నం, మోదుగులపేట, బిల్లాని, ఎస్.రంగరాయపురం, కె.ఆర్.పురం, గోవిందపురం, పుల్లిట గ్రామాల నాయకులు, అభిమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంత సీఎం జగన్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి.. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 27: జిల్లాలో విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ గిరిజన ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అడ్డూరి పైడితల్లి కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పైడితల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు రమేష్, అప్పారావు, సూర్రాము, రమణ, సామన్నదొర, పూడి రాజు, ఆర్.ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.


డీఈవోని అభినందిస్తున్న ఎస్టీ ఉపాధ్యాయ నాయకులు

ఖోఖోలో క్రీడాకారుల ప్రతిభ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 27: తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఈ నెల 23 నుంచి 25 వరకూ జరిగిన అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో జిల్లా పురుషుల జట్టు ద్వితీయ స్థానం, స్త్రీల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజయం సాధించిన క్రీడాకారులను ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమజ్జి విజయలక్ష్మి, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపాల్, కోశాధికారి మల్లికార్జున్‌లు అభినందించారు. ఈ జట్టుకు మేనేజరుగా సత్యప్రసాద్ వ్యవహరించారు.


విజయం సాధించిన ఖోఖో క్రీడాకారులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులతో అనారోగ్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని జుమ్మువలస గ్రామం సమీపంలో సిక్స్‌లైన్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాలతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని కొండకెంగువ సర్పంచ్ కంచుపల్లి సుజాత తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ జ్ఞానప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సబ్బవరం నుంచి రాయపూర్ వరకు రోడ్డు నిమిత్తం నిర్మాణాలు జరుగు తున్నాయని, వీటివలన దుమ్మూ ధూళి పేరుకుపోయి కాలుష్యం ఎక్కువవడంతో చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నార ని తెలిపారు. బేస్‌క్యాంపు ఏర్పాటుకోసం రెండేళ్ల కిందట పంచాయతీ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారని, ఇది కాకుండా కంపెనీవారు పంచాయతీ అను మతులు అదిగమించి కాలుష్య కారకమైన క్వారీలు, పెట్రోలు బంకులు, అనధికార యంత్రాలు ఏర్పాటు చేసి రాత్రీ, పగలు పనులు చేయడంతో నిత్యం దుమ్ము, ధూళి పేరుకుంటుందన్నారు. దీనిపై ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ సర్పంచ్, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ధూళి, దుమ్ము వ్యాప్తికి కారణమవుతున్న యంత్రం

జిందాల్ భూ నిర్వాసితుల దీక్షలు విరమణ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 27: తమ న్యాయమైన కోర్కెలు నేరవేర్చాలని కోరుతూ కిల్తంపాలెం జిందాల్ కార్యాలయం వద్ద వారం రోజులుగా నిరసన దీక్ష సాగిస్తున్న భూ నిర్వాసితులు మంగళవారం సాయంత్రం విరమించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వారితో మాట్లాడుతూ భూ నిర్వాసితుల సమస్యలను కలెక్టర్, ఆర్‌డీవోకు వివరించామని, వారు పది రోజుల్లో యాజమాన్యాన్ని రప్పించి చర్చలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారుల మాటకు విలువ ఇచ్చి దీక్ష విరమించాలని రఘురాజు కోరడంతో నిర్వాసితులు నిరసన విరమించారు. పది రోజులు వేచి చూద్దామని.. అప్పటికీ పరిష్కారం కాకపోతే 15వ రోజు నుంచి నిరసనలు ఉధృతం చేద్దామని ఎమ్మెల్సీ వారికి మాట ఇచ్చారు.


మాట్లాడుతున్న రఘురాజు

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 27: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 27: రంగారాయపురం గ్రామంలో మంగళవారం ఎడ్లబండ్ల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. మరిడిమాంబ తీర్థమహోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు ఈ పోటీలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ తీర్థ మహోత్సవం మంగళవారంతో ముగిసింది.


దౌడు తీస్తున్న ఎడ్లబండి

సాగు పరికరాల పరిశీలన

తెర్లాం: మండలంలో ఏపీఎంఐపీ ద్వారా రైతులకు పంపిణీ చేసిన బిందు, తుంపర సేద్య పరికరాలను ఏపీఎంఐపీ జేడీ లక్ష్మీనారాయణ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంట్లవార గ్రామ రెవెన్యూలో తోట పంటల్లో రాయితీపై అందించిన బిందు సేద్య పరికరాలను పరిశీలించి, రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సునీల్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్, ఏపీఎంఐపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


బిందుసేద్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సెలవుపై జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

రాజాం రూరల్: రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్ కామేశ్వరరావు సెలవుపై వెళ్లారు. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రెండ్రోజుల ముందు ప్రిన్సిపాల్ మెడికల్ లీవ్‌పై వెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పలు కళాశాలల నుంచి హాజరైన విద్యార్థుల నుంచి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలు కళాశాల సిబ్బంది బహిరంగంగానే గుసగుసలాడుతున్న పరిస్థితులు తలెత్తడంతో ప్రిన్సిపాల్ కామేశ్వరరావు సెలవు పెట్టినట్లు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే కళాశాలలో మనబడి- నాడునేడు మొదటివిడత పనుల్లో సైతం ప్రిన్సిపాల్ చేతివాటం ప్రదర్శించిన విషయంపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే. విడుదలైన మొదటివిడత నిధులను ప్రాధాన్య పనులకు వెచ్చించకుండా వేరే పనులు జరిపించిన నేపథ్యంలో డీవీ ఈవో, ఆర్జేడీ పలుమార్లు దర్యాప్తు నిర్వహించారు. ప్రిన్సిపాల్‌కు చార్జి మెమో సైతం జారీ చేశారు. అప్పట్లో సైతం ప్రిన్సిపాల్ కామేశ్వరరావు నెలరోజుల పాటు మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఇదిలా ఉంటే ఒకేషనల్ లెక్చరర్ ఉరిటి జగదీశ్వరరావుకు ప్రిన్సిపాల్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఎంఆర్ కళాశాలలో యువ సంవాద్-2047

విజయనగరం రూరల్: మహారాజా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువ సంవాద్-2047 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్టణం రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి స్వసం వేదానంద మహారాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ డీపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వనసంరక్షణలో రాజుగారు

● మొక్కలకు నీటి తడి అందిస్తున్న అశోక్ గజపతి

● బంగ్లా ప్రాంగణంలో మొక్కల పెంపకం

కేంద్ర, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనేక పదవులు అనుభవించిన అశోక్ గజపతిరాజు ప్రస్తుతం ఖాళీ సమయంలో మొక్కల సంరక్షణ చేపడుతున్నారు. అశోకుని వనం మాదిరిగా ఉండే బంగ్లా ప్రాంగణంలో అనేక పండ్ల చెట్లు, పూల మొక్కలు ఉన్నాయి. ప్రత్యేకమైన మామిడి పండ్ల జాతుల చెట్లు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా మొక్కల రైలింగ్ ఉంది. ఈ రైలింగ్‌ను నాజూగ్గా కట్ చేసే పనులను కూడా అశోక్ చేపడుతున్నారు. అలాగే పూల, పండ్ల మొక్కలకు నీటి తడి అందించి మండు వేసవిలో కూడా అకుపచ్చగా కళకళ లాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అశోక్ కుటుంబ సభ్యులు వాకింగ్ వంటి వ్యాయామ చర్యలు చేపడుతుంటారు. అయితే అశోక్ గజపతి రాజు వ్యాయామం చేస్తూనే పని చేయటం ద్వారా కూడా శారీరక శ్రమతో పాటు పచ్చదనం కూడా పొందుతున్నారు. పచ్చని మొక్కల ద్వారా స్వచ్ఛమైన గాలిని పొందవచ్చని, ప్రాంగణం ముచ్చటగా కన్పిస్తుందని అశోక్ వెల్లడించారు. మంగళవారం బంగ్లా ప్రాంగణంలో మొక్కలు కట్‌చేస్తూ ఆయన ఇలా కనిపించారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)


బంగ్లాలో మొక్కలు కట్ చేస్తున్న అశోక్‌గజపతి

విద్యావంతులకే పట్టం

● టీడీపీ-జనసేన తొలి జాబితాలో విద్యాధికులే ఎక్కువ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ విడుదల చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల మొదటి జాబితాలో అత్యధికంగా విద్యావంతులకే అవకాశం కల్పించారు. విజయనగరం నుంచి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు విద్యావంతురాలు. ఈమె తాత తండ్రుల రాజకీయ వారసత్వంతో పాటు ఉన్నత చదువులను అభ్యసించారు. పీ.జీ విద్యను అభ్యసించి గల్ఫ్‌దేశమైన అబూదాబి, చెన్నైలో టీచర్‌గా పనిచేశారు. మాన్సాస్ ట్రస్ట్ సంస్థలకు 2017-20లో ట్రస్ట్ మెంబర్‌గా పనిచేసిన అనుభవం అదితికి ఉంది. అలాగే గజపతినగరం నుంచి కొండపల్లి శ్రీనివాస్, రాజాం నుంచి కోండ్రు మురళీమోహన్, బొబ్బిలి నుంచి బేబీనాయన, నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి లోకం మాధవి కూడా గ్రాడ్యుయేషన్ ఆపైన చదువుకున్న వారే కావటం గమనార్హం. విద్యావంతులు కావడం వల్ల ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను అవగాహన చేసుకునే అవకాశం ఉంది.

టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితం

విజయనగరం రింగురోడ్డు: పదో తరగతి పరీక్షలకు హాజరౌతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 18 నుంచి 30 వరకూ ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తాము నివసిస్తున్న నివాస ప్రాంతం నుంచి పరీక్షా కేంద్రం వరకూ వెళ్లే పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో హాల్ టిక్కెట్ చూపించి, ఉచితంగా ప్రయాణించవచ్చునని పేర్కొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

రామభద్రపురం: ఖాతాదారులకు సేవలు అందించడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎపుడూ ముందంజలో ఉంటుందని ఎస్‌బీఐ డీజీఎం దేవీలాల్ మెహరా తెలిపారు. మంగళవారం స్థానిక ఖాతాదారుల సేవా కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ సేవా కేంద్రాల వినియోగం పెరగాలన్నారు. కేంద్రప్రభుత్వ బీమా పథకాలైన ఏబీవై, పీఎంజేజీబీవై వంటివాటిని ఖాతాదారులు వినియోగించుకోవాలన్నారు. పెన్షన్ పథకం కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచిని సందర్శించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.

జియో రామకృష్ణకు గుర్తింపు

శృంగవరపుకోట: ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఆధ్వర్యంలో శృంగవరపుకోటకు చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణకు బెస్ట్ హ్యూమనిటేరియన్ ఎక్సలెన్స్ సేవా ఎన్‌జీవో అవార్డు -2024ను అందించారు. విశాఖలో మెడికవర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామ్మూర్తి, వరుణ్ హెల్త్ సెంటర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బంగార్రాజు, ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారి బి.కె.రామేశ్వరి, తదితరుల నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు రామకృష్ణ ప్రకటనలో తెలిపారు.

'విశ్వకర్మ'ను వినియోగించుకోండి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అధికారి శర్మ, పథక అసిస్టెంట్ డైరెక్టర్ అప్పికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

వంగర: మడ్డువలస జూనియర్ కళాశాలలో వచ్చే నెల ఒకటి నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మంగళవారం పోలీసు స్టేషన్‌లో భద్రపరిచినట్టు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. జనరల్, ఒకేషనల్‌కు చెందిన మూడు సెట్ల పేపర్లు వచ్చాయన్నారు.

నేడు బొబ్బిలి పట్టణంలో తాగునీరు బంద్

బొబ్బిలి: భోజరాజపురం వేగావతి నదిలో మున్సిపల్ ప్రధాన వాటర్‌వర్క్స్ నిర్వహణ, మర మ్మతులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం పట్ట ణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలి పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటివనరు లను కాపాడుకునేందుకు పలు చర్యలు చేపడుతున్నా మని, ఇందుకోసం అవసరమైన పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

పుస్తకాల పంపిణీ

విజయనగరం రూరల్: టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు పుట్టిన రోజు సందర్భంగా రాకోడు, పినవేమలి, కోరుకొండపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గల 180 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. వేచలపు శ్రీను, కనకల రాంబాబు, చొప్ప రామారావు, వేచలపు రామసత్యం, గనివాడ రామసత్యం తదితరులు పంపిణీ చేశారు.

రేపు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా


మాట్లాడుతున్న నాయకులు

బొబ్బిలి: ఉపాధ్యాయ వర్గాలకు చెందిన అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న అన్ని పాత తాలూకా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఏపీటీఎఫ్ నాయకు లు సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, ఎల్లయ్య, లక్ష్మణరావు, శ్రీను, చిన్నారావు, మోహనరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ధర్నాలు విజయవంతం చేయండి

విజయనగరం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న జిల్లా వ్యాప్తంగా అన్ని తాలుకా కేంద్రాల ఎదుట నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా ప్రతినిధులు బుకారిబాబు, జేసీ రాజులు పిలుపునిచ్చారు. మంగళవారం కోట జంక్షన్‌లో ఉన్న ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించాలని, రూ.20కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో జిల్లా వాసి మృతి


నాగరాజు (ఫైల్)

దత్తిరాజేరు: రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన విశాఖలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాచలవలస గ్రామానికి చెందిన సుంకరి నాగరాజు(39) విశాఖలోని పరదేశిపాలెంలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్య, పిల్లలతో అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం బైకుపై వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో తీవ్రగాయపడ్డాడు. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందాడు. మృతుడికి భార్య సూర్యకాంతం, కుమార్తెలు దేవికా, యొగిత ఉన్నారు. నాగరాజు మృతితో స్వగ్రామమైన పాచలవలసలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దాడికి పాల్పడిన కేసులో ఇద్దరి అరెస్టు

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 27: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్ పురం శివారుల్లో ఓఎల్‌ఎక్స్‌లో సెల్‌ఫోన్ అమ్ముతామంటూ వచ్చి దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు యువకులను మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ క్రైం ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. నగరంలోని పాల్‌నగర్‌కు చెందిన విసినిగిరి కుమార్ అలియాస్ సూర్య గజపతినగరానికి చెందిన సోము నవీన్ ఓఎల్‌ఎక్స్‌లో సెల్‌ఫోన్ అమ్ముతామంటూ తెలపటంతో ఒక యువకుడు వారిని సంప్రదించగా కేఎల్ పురం శివారులోని మామిడి తోటలోకి తీసుకువెళ్లి ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఆయన వద్ద ఉన్న రూ.7వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు తీసుకుని పరారయ్యారు. దీనిపై బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది కేఎల్‌పురంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కుమార్, నవీన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.2వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు.

మొయిద నారాయణపట్నంలో అగ్నిప్రమాదం

నెల్లిమర్ల: మొయిద నారాయణపట్నంలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు ఓ పూరిపాకకు నిప్పు అంటుకోవడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గీత కార్మికుడు రమేష్, లక్ష్మికి చెందిన పూరిపాక దగ్ధమైంది. రూ.30వేల నగదు, రూ.50వేలు విలువగల మేకలతో పాటు ఇంటిలో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే పక్కనే ఉన్న పతివాడ సత్యంకు చెందిన పశువుల శాల, గడ్డి వాము దగ్ధమయ్యాయి. మొత్తం ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. స్థానిక యువకులు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. అనంతరం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి, ప్రమాద తీవ్రత తగ్గించారు. స్థానిక యువకులు రూ.50వేలు సేకరించి, సర్పంచ్ అట్టాడ కృష్ణ సమక్షంలో బాధితుడు రమేష్ కుటుంబానికి అందించారు.

గడ్డివాముకు నిప్పు

వంగర, ఫిబ్రవరి 27: మడ్డువలస రిజర్వాయర్ ఎడమ కాలువకు ఆనుకొని ఉన్న పంట పొలాల్లో గడ్డివాముకు కొందరు ఆకతాయిలు మంగళవారం నిప్పుపెట్టారు. సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లకు మంటలు వ్యాపించడంతో ముగ్గురుకు చెందిన పోలిరెడ్డి రమేష్, అప్పలనాయుడు తదితరుల విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.


కాలిపోతున్నగడ్డివాములు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్ల, ఫిబ్రవరి 27: గరికవలస గ్రామానికి చెందిన కనిమెరక సన్యాసప్పలనాయుడు (48) రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం కూలి పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో ఎస్ఎస్ఆర్.పేట వద్ద రోడ్డును దాటుతుండగా చీపురుపల్లి నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. స్థానికులు 108 వాహనంపై విజయనగరం ఆసుపత్రికి తరలించగా అప్పటికే సన్యాసప్పలనాయుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు గుర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

● ముగ్గురికి గాయాలు

పాలకొండ: మండలంలోని సిరికొండ సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పాలకొండ మండలం లుంబూరు గ్రామానికి చెందిన ఉపేంద్రకుమార్, వినోద్‌కుమార్, సాయి ద్విచక్ర వాహనంపై పాలకొండ నుంచి సీతంపేట వెళుతుండగా ఎదురురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఉపేంద్రకుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పాలకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

తెర్లాం, ఫిబ్రవరి 27: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులు, పాఠకులు నివాళులు అర్పించారు. ఆజాద్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని గ్రంథాలయాధికారి కోరారు.


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ముగిసిన సాంకేతిక సింపోజీయం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 27: జేఎన్‌టీయూ గుర జాడ విశ్వవిద్యాలయంలో సోమవా రం ప్రారంభమైన సాంకేతిక సింపోజియం మంగళవారం ముగిసింది. వివిధ కళాశాలల విద్యార్థులు నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ప్రథమ స్థానంలో సీతం కళాశాల, రెండో స్థానంలో లెండి, తృతీయ స్థానంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రాజెక్టులు నిలిచాయి. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకుమార్ హాజరయ్యారు. విభాగాధిపతి ఎ.పద్మజ, కన్వీనర్ డాక్టర్ వీఎస్ వకుళ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్స్ పి.శ్రీనివాసుల రెడ్డి, టి.శిరీష, స్టూడెంట్ కో-ఆర్డినేటర్స్ రాము, దయాకర్, విజయశ్రీ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టు

సహారా ఖాతాదారుల నిరసన


నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

గరుగుబిల్లి: సహారా ఇండియాలో డిపాజిట్లు చేశామని, అయితే చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొందని పలువురు ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పార్వతీపురం కార్యాలయం ఎదుట యూనియన్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గరుగుబిల్లికి చెందిన గెంబలి సర్వేశ్వరరావు మాట్లాడుతూ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొందన్నారు. పలు గ్రామాలకు చెందిన వారు అధికంగా ఏజెంట్లును నమ్మి సహారా ఇండియాలో పలు పథకాలకు డిపాజిట్లు చేశారన్నారు. కాల పరిమితి ముగిసినా చెల్లింపులు జరగకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఖాతాదారులకు ఏజెంట్లు నిర్దేశించిన సమయంలో పూర్తిస్థాయి అందించాలన్నారు. సెబీకి, సహారాకు మధ్య ఉన్న సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఏజెంట్లుకు అధికంగా ప్రలోభాలు పెట్టి అధిక మొత్తాలను డిపాజిట్లు చేయించారని, ప్రస్తుతం చెల్లింపులు లేవని, ఏజెంట్లుకు సహరా అందిస్తామన్న సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు.

పనివేళలో వెలుగు కార్యాలయానికి తాళం


వైకేపీ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

గరుగుబిల్లి: మండల కేంద్రంలో ఉన్న వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయానికి మంగళవారం తాళం వేసి, సిబ్బంది మొత్తం బయటకు వెళ్లారు. ఏదైనా కార్యక్రమానికి వెళ్తే కనీసం ఒకరిద్దరైనా కార్యాలయంలో ఉండాల్సి ఉంది. కానీ మంగళవారం మొత్త సిబ్బంది బయటకు వెళ్లడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సిబ్బంది పనితీరు కూడా బాలేదని ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు చేపడతాం

గరుగుబిల్లి వెలుగు సిబ్బంది పనితీరుపై దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పనివేళల్లో తాళాలు వేయడం నా దృష్టికి రాలేదు. దీనిపై దర్యాప్తు నిర్వహించి చర్యలు చేపడతాం.

– వై.సత్యంనాయుడు, జిల్లా ఇన్‌చార్జి, గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ

రీసర్వే వేగవంతం చేయాలి


రీసర్వేపై ఆరా తీస్తున్న ఆర్డీవో

భామిని: రీసర్వే వేగవంతం చేసి, స్టోన్‌ప్లాంటేషన్ చేయాలని పాలకొండ ఆర్డీవో వి.రమణ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రీసర్వేపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ రీసర్వేలు అవుతున్నాయో సిబ్బందిని ప్రశ్నించారు. కీసర, కోసలి, లివిరిలో రీసర్వే పనులు జరుగుతున్నాయని చెప్పగా, వేగవంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి లివిరిలో స్టోన్‌ప్లాంటేషన్ చేపట్టాలని డీటీ శేఖర్‌ను ఆయన ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్ఐ ఎస్.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'లిప్' పక్కాగా అమలు చేయండి

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి (లిప్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని లిప్ రాష్ట్ర కోఆర్డినేటర్ డా.ఎస్.ఉపేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, విద్యార్థుల విద్యాస్థాయి మెరుగుతీరు తదితర అంశాలపై అధ్యాపక బృందంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా స్థాయి మెరుగుకు ఎంఈవోలు, హెచ్ఎంలు, డైట్ అధ్యాపకులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి 8వ తరగతి విద్యార్థులకు బయాలజీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో మాదిరి పాఠ్య బోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, అధ్యాపకులు ఎంఎస్ఆర్ శర్మ, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన


సచివాలయాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

గజపతినగరం (దత్తిరాజేరు): గడసాం గ్రామ సచివాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం పరిశీలించారు. మాజీ సర్పంచ్ మురిపాక జ్యోతిలక్ష్మి, మండల పైడిరాజులు ఇటీవల గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పనితీరు బాగాలేదని, సచివాలయంలో సిబ్బంది లేరని, చెత్త బుట్టల పంపిణీ జరగలేదని గ్రీన్ అంబాసిడర్లు చెత్తను తీసుకెళ్లడం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలోని యువత సింగారపు నారాయణరావు, సింగారపు నవీన్, బూడి రామకృష్ణ, నేతేటి రామచంద్ర, మజ్జి హరికృష్ణ, నేతేటి సురేష్, సుత్తి సంతోష్ తదితరులు అసిస్టెంట్ కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు.

పోలింగ్ కేంద్రాన్ని యధావిధిగా ఉంచాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీలో 252 నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని యధావిధిగా ఉంచాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్ భాస్కర్ తహసీల్దార్ కె.జయప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. వృద్ధులు, దివ్యాంగులు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి ఓట్లు వేయడం కష్టంగా ఉంటుందని, పోలింగ్ బూత్‌ను యధావిధిగా ఉంచాలని కోరారు. టీడీపీ వీరఘట్టం పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమ, నివర్తి శశి, కోట శంకర్, నత్తల అరుణ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దమన్‌జోడి నెల్కోలో ప్రమాదం

- ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

సాలూరు రూరల్: ఏవోబీలో సాలూరు మండలానికి సమీపంలో ఉన్న ఒడిశా రాష్ట్రం దమన్‌జోడి నెల్కో (నేషనల్ అల్యూమినియం లిమిటెడ్) కర్మాగారంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు జార్ఖండ్‌వాసులు మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కర్మాగారంలో జార్ఖండ్‌కు చెందిన సామరాజేష్, సనత్ కునాయి రాడ్లు బెండింగ్ పనులు చేస్తుండగా, అప్పటికే కట్టిన రాడ్లు కుప్పకూలాయి. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందగా, అదే రాష్ట్రానికి చెందిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం ఏపీలో విశాఖకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సునాబేడ డీఎస్పీ మనోభ్రాత శతపతి చెప్పారు.

వన్‌ధన్ వికాస కేంద్రాలను వినియోగించుకోండి


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ

సాలూరు రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి వన్‌ధన్ వికాస కేంద్రాలను వినియోగించుకోవాలని వెలుగు జిల్లా ఏపీడీ వై.సత్యంనాయుడు అన్నారు. అన్నంరాజువలసలో వన్‌ధన్ వికాస కేంద్రంలో మహిళలకు ఇస్తున్న కొండ చీపుర్ల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు ప్రవీణ్, అప్పారావు, ఏపీఎంటీఎల్ వెంకట్, సాలూరు ఏపీఎం గండిపిల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడుదాం

- టీడీపీ-జనసేన విజయానికి కృషి చేద్దాం
- గ్రామాల్లో ఉమ్మడి పార్టీ నాయకుల ప్రచారం


పార్వతీపురం: విజయచంద్రను సన్మానిస్తున్న జగదీష్, చిరంజీవులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒకే కుటుంబంలా ఉంటూ వచ్చే ఎన్నికల్లో విజయచంద్రను ఎమ్మెల్యేగా గెలిపించి, చంద్రబాబుకు బహుమతిగా ఇద్దామని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. పార్వతీపురంలోని మాజీ ఎమ్మెల్సీ జగదీష్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోనెల విజయచంద్ర గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. చిరంజీవులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని కోరారు. విజయ చంద్ర మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈసందర్భం గా విజయచంద్రను జగదీష్, చిరంజీవులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, నాయకులు జి.రవికుమార్, కోలా వెంకటరావు, కె.ప్రదీప్, డి.మోహన్, కొల్లి తిరుపతిరావు, పాలకొండ రాజశేఖర్, ఎం.కార్తీక్ పాల్గొన్నారు. ● **మక్కువ:** టీడీపీ విజయానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. మండలంలోని శంబర, బంగారువలస, వెంకటభైరిపురం గ్రామాల అసంతృప్త నాయకులను ఆమె మంగళవారం కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, చింతల తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు. ● **సీతంపేట:** రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని జనసేన పార్టీ నియోకవర్గ నాయకుడు కూరంగి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు విశ్వనాథం కోరారు. వారు మంగళవారం రామనగరం గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సూపర్‌సిక్స్ పథకాలు

దత్తిరాజేరు: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల హృదయాల్లో నాటుకుపోయాయని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గదబవలస, ఇంగిలాపల్లి, మర డాం, తాడేంద్రవలస గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరినీ కలుపుకొని వెళ్తానని.. ఎలాం టి బేధాభిప్రాయాలు లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, బొండపల్లి మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బాలి శంకరరావు, మాజీ సర్పంచ్ గాడి కృష్ణ, కర్రి రామకృష్ణ, గుసిడి వేణు, గిడిజాల సూర్యనారా యణ, పి.రమేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ● **గంట్యాడ:** టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. మురపాక, గింజేరు, నరవ గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి, శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.


దత్తిరాజేరు: ప్రచారం చేస్తున్న శ్రీనివాస్


సీతంపేట: ప్రచారం చేస్తున్న జనసేన కార్యకర్తలు

సాలూరులో భువనేశ్వరి పర్యటన

- ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు

సాలూరు: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం సాలూరులో పర్యటించారు. ఈసందర్భంగా ఆమెను పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సాలూరులోని ఇప్పిలివారి వీధిలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె వెంట టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఉన్నారు. అనంతరం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భువనేశ్వరి


భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న 21వ వార్డు కౌన్సిలర్ సీతమ్మ

పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

సాలూరు రూరల్: పోలీసులు ప్రజా స్నేహితులని ఏఎస్పీ సునీల్ షియోరన్ అన్నారు. కొఠియా గ్రూపు నేరేళ్లవలసలో మంగళవారం సాలూరు రూరల్ ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్యులు పరీక్షలు చేసి, అవసమైనవారికి మందులు అందించారు. గిరిజనులకు గొడుగులు, వాలీబాల్ కిట్లు, దుప్పట్లు, రేషన్ పంపిణీ చేశారు. 500 మంది గిరిజనులకు మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, కొఠియా సీఐ నారాయణరావు, రోహిణీవలస ఏఎంసీ ఛైర్మన్ ప్రతినిధి దండి శ్రీనివాసరావు, సారిక సర్పంచ్ ప్రతినిధి గొర్లె రాజారావు, మండల పరిషత్ సభ్యుడు గుడివాడ సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

● **గుమ్మలక్ష్మీపురం:** మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు పేర్కొన్నారు. ఎస్టీ గోయిపాక గ్రామంలో మంగళవారం ఎల్విన్‌పేట పోలీసులు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివప్రసాద్, సర్పంచ్ కేరంగి లక్ష్మి, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ కార్యదర్శి, వైస్ ఎంపీపీ లక్ష్మణరావు, ఎంపీటీసీ కవిత, ఉప సర్పంచ్ కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- ఎండీఎం అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి


ఎండీఎంను పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

గజపతినగరం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లేనిఎడల సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎండీఎం అడిషనల్ డైరక్టర్ ఎ.సుబ్బారెడ్డి అన్నారు. మరుపల్లి గ్రామంలో ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జిల్లా పరిషత్ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో చెట్టు కింద వంటలు చేయడంతో, షెడ్‌పై ఆరా తీశారు. వంట షెడ్ నిర్మాణ దశలో ఉందని పనులు పూర్తయిన తక్షణమే షెడ్ వినియోగంలోకి తీసుకువస్తామని ఎంఈవో ఎస్.విమలమ్మ తెలిపారు. భోజన విషయంలో రాజీ పడవద్దని, విద్యార్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. అనంతరం సరుకుల వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 చక్రధర్, పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక బృందాలకు వరాలు


సీఎం కార్యక్రమాన్ని తిలకిస్తున్న రామేశ్వర్, భాస్కర్, నిహార్

రాయగడ: మిషన్ శక్తి స్వయం సహాయక బృందాలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరాలు కురిపించారు. ఈ మేరకు మంగళవారం వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీ సమావేశ హాలులో అదనపు కలెక్టర్లు రామేశ్వర ప్రధాన్, భాస్కరచంద్ర రౌయిత్, జడ్పీ చీఫ్ డెవలప్‌మెంట్ అధికారి నిహర రంజన్ కహార్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 4,266 స్వయం సహాయక బృందాలు గతంలో తీసుకున్న రుణాలకు వారు చెల్లించిన వడ్డీని తిరిగి వారికి చెల్లించారు. అలాగే ఆయా బృందా లకు యూనిఫారం, బ్లాజర్లు అందజేశారు. రూ.1కోటి 37లక్షల 51వేల 783 ఆర్థిక రుణ సాయం అందజేశారు. దీని ద్వారా ప్రతి సభ్యురా లు వెయ్యి రూపాయలు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రెండు వేలు పొందుతారు. బృందంలోని ప్రతి మహిళ రూ.10లక్షల వరకు వడ్డీలే ని రుణం పొందే అవకాశం కల్పించారు. ఈ వీసీలో ఒడిశా జీవిక మిషన్ డీపీఎం హేమంత్ బాగ్, ఓర్మాస్ డిప్యూటీ సీఈవో మనోజ్‌పా త్ర, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా

చంద్రపూర్ సమితిలో వినతుల స్వీకరణ

రాయగడ: చంద్రపూర్ సమితిలో జిల్లా యంత్రాంగం వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టింది. జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహజన్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయత్ అధ్యక్షతన చంద్రపూర్ సమితి సద్భావన హాలులో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మొత్తం 45 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. 20 వ్యక్తిగత ఫిర్యాదులు, 15 సామూహిక ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన భాస్కర చంద్ర త్వరితగతిన పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఫిర్యాదుల్లో గ్రామస్థులు తాగునీరు, రహదారులు, ఇంటర్నెట్ సేవలు, విద్యుత్ వంటి సమస్యలపై ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు కోరారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్స్‌పోలియో రూట్ సూపర్‌వైజర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించడంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేం ద్రాలు, గ్రామ పంచాయతీ, సచివాలయం తదితర ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు పెట్టాలని సూచించారు. వ్యాక్సిన్ కేరియర్, కోల్డ్‌బాక్స్‌లు, ఐస్‌ప్యాక్‌లు, రిఫ్రిజిరేటర్లు సిద్ధంగా ఉన్నవి, లేనివి చూసుకోవాలని తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ విధిగా చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.రామారావు, ఆర్‌బీఎస్‌కే పీవో దవళ భాస్కరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు 14 బహుళ జాతి కంపెనీలు హాజరవుతాయన్నారు. 18 నుం చి 30ఏళ్ల వయసు ఉన్న ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ పూర్తిచేసినవారు ఈ మేళాకు హాజరుకావచ్చునన్నారు. తమ వివరాలను www.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ నమోదు రిఫరెన్సుతో పాటు ఇతర విద్యార్హత ధ్రువపత్రాలు, ఒరిజినల్, జిరాక్సుల తో సహా 29న ఉదయం 9 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇతర వివరాల కోసం 9010023033, 728042743 నెంబర్లకు గానీ, టోల్‌ఫ్రీ నెంబరు 9988853335కు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ కృష్ణాజీ సూచించారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందించాలి

పాలకొండ: పాత గృహాలకు ఓటీఎస్ పేరుతో రూ.15వేలు వసూలు చేసి ఇంత వరకు రిజిస్ట్రేషన్లు చేయలేదని టీడీపీ నాయకుడు గుమ్మడి సింహాద్రి ఆరోపించారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ చేస్తామని డబ్బులు వసూలు చేసి కొందరికి రిజిస్ట్రేషన్ చేసి, మరికొందరికి చేయలేదని ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించగా అదిగో, ఇదిగో అని సమాధానం చెబుతున్నారని అన్నారు. కొన్ని నెలలు గడిచినా ఇంతవరకు ఫలితం లేదన్నారు. పట్టణంలో కేవలం 9 సచివాలయాల పరిధిలో 150 నుంచి 160 మంది బాధితులు ఉన్నారని సింహాద్రి తెలిపారు. ఓటీఎస్ పేరుతో డబ్బులు వసూలు చేయడం అన్యాయమని, దీనికి టీడీపీ ఖండిస్తుందన్నారు. తక్షణమే ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

గరుగుబిల్లి: మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అధికారులను కోరారు. మంగళ వారం ఎంపీడీవో పైల సత్యనారా యణ దృష్టికి వివిధ సమస్యలను తీసుకువెళ్లారు. వేసవిలో తాగునీ టి ఎద్దడి నెలకొనకుండా చర్యలు చేపట్టాలన్నా రు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అనేకమందికి నేటి కీ మంజూరు కాలేదన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చర్యలు చేపడతామని చెప్పారు. పింఛన్లు మంజూరు కాని వారి వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కు పంపించినట్టు తెలిపారు. ఏవో ఎన్.అర్జునరావు ఉన్నారు.

సిరిమాను చెట్టు తరలింపు

గంట్యాడ: గంట్యాడ గ్రామంలో మార్చి 17న జరగనున్న ఎల్లమాంబ సిరిమానోత్సవానికి మంగళవారం సిరిమాను చెట్టును ఆ గ్రామానికి తరలించారు. ఎస్.కోట వేములాపల్లిలోని లగుడు దేవుడమ్మ కల్లంలో పాచి చెట్టుకు ఆలయ పూజారి పూజలు చేసి, కట్ చేశారు. అక్కడ నుంచి గ్రామానికి తీసుకుని వచ్చారు.

క్లుప్తంగా..

సారా స్వాధీనం

సీతంపేట: బందమానుగూడ సమీపంలో రూట్‌వాచ్ చేస్తుండగా అక్రమంగా సారా తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులు పట్టుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సీతంపేట మండలం మండ నుంచి పాలకొండకు సారా తరలిస్తుండగా, ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ బి.చలమనాయుడు, హెచ్‌సీ ఉపేంద్రకుమార్ వారిని గుర్తించి, పట్టుకున్నారు. సారా స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని రావుపల్లి మాజీ సర్పంచ్, విశ్రాంత ఎంఈవో గుల్ల కాశీనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఫార్మాసిస్టు దాసరి మృత్యుంజయరావుకు వినతి పత్రం అందించారు. వేసవిలో జ్వరాలతో పాటు డయేరియా వంటి వ్యాధులు వ్యాపించే పరిస్థితి ఉందన్నారు. రావుపల్లిలో వైద్య శిబిరం నిర్వహించేందుకు దృష్టి సారించాలన్నారు. శంకరరావు, మాధవరావు పాల్గొన్నారు.

ఆదాయం వచ్చే పంటలపై దృష్టి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు మానస, సరోజిని సూచించారు. మంగళవారం తోటపల్లి ఆర్బీకే పరిధిలోని నందివానివలసలో రైతులకు అవగాహన కల్పించారు. ఆదాయం లభించే ఏటీఎం పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం.అప్పలనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

జీగిరాంలో ప్రజాపోరు

సాలూరు రూరల్: తెల్లకార్డుదారులకు ప్రస్తుతం రేషన్ బియ్యం అందిస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి జలుమూరి మణికుమార్ అన్నారు. మంగళవారం జీగిరాంలో ప్రజా పోరు నిర్వహించారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. కరోనా నుంచి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తున్నదని చెప్పారు. పీఎం కిసాన్ యోజన కింద రైతులకు రూ.2వేలు అందజేస్తున్నదని తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ గొర్లె ప్రసాదరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ముదరక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

రాజాం రూరల్: విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. బొద్దాం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. పలు అంశాలపై విద్యార్థులతో, ఉపాధ్యాయులతో చర్చించారు.